క్లుప్తంగా

స్థలాన్ని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

కడప రూరల్: ఇంటితోపాటు స్థలం ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని బద్వేల్ పట్టణానికి చెందిన గంగసాని రాజగోపాల్ రెడ్డి ఆరోపించారు. బుధవారం స్థానికంగా విలేకరులతో ఆయన మాట్లాడారు. బద్వేల్ మండలం చెన్నంపల్లి కి చెందిన అన్నపురెడ్డి వెంకట లక్ష్మమ్మ, అన్నపురెడ్డి నాగ సుజాత లు వారి అవసరాల నిమిత్తం వారికున్న స్లాబ్ మిద్దెలతో కలిపి మొత్తం 6 సెంట్లు స్థలం తనకు విక్రయించారని పేర్కొన్నారు. స్థానికంగా ఉన్న ఒకతను దొంగ పట్టాలను సృష్టించి, రెండు స్లాబ్ మిద్దెలతోపాటు మొత్తం ఆరు సెంట్లు స్థలం ఆక్రమించుకున్నారని ఆరోపించారు. అధికారులు తనకు న్యాయం చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

కడప కార్పొరేషన్: కడప నగరంలోని సచివాలయాల్లో పనిచేస్తున్న వార్డు వెల్ఫేర్ సెక్రటరీల సమస్యలు పరిష్కరించాలని వార్డు వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సెక్రటరీల అసోసియేషన్ ప్రెసిడెంట్ వీరయ్య, ప్రధాన కార్యదర్శి సాగర్, ఉపాధ్యక్షుడు శివ, ఉప ప్రధాన కార్యదర్శి నవీన్ కోరారు. బుధవారం వారు నగరపాలక అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రన్‌కు వినతి పత్రం సమర్పించారు.

రెండు రైళ్ల గడువు పొడిగింపు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప మీదుగా వివిధ ప్రాంతాలకు నడుస్తున్న రెండు రైళ్ల గడువును పొడిగించినట్లు కడప రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. అహ్మదాబాద్ నుంచి తిరుచునాపల్లి జంక్షన్ (09419)కు ప్రతి గురువారం నడిచే ఈ రైలు ఈనెల 26వ తేదినుంచి డిసెంబరు 26వ తేదికి పొడిగించారన్నారు. అలాగే తిరుచునాపల్లి జంక్షన్ నుంచి అహ్మదాబాద్ వెళ్లే (09420) రైలు డిసెంబరు 29వ తేది వరకు పొడిగించారన్నారు. అలాగే ఓకా నుంచి మధురై (09520) వెళ్లే వారాంతపు రైలు ఈనెల 30 నుంచి డిసెంబరు 30వ తేది వరకు పొడిగించారన్నారు. ఈ రైలు ప్రతి సోమవారం రాకపోకలు సాగిస్తుందన్నారు. మధురై నుంచి ఓకా (09519) వెళ్లే రైలు అక్టోబరు 4 నుంచి జనవరి 3వ తేది వరకు పొడిగించారన్నారు. ఈ రైలు ప్రతి శుక్రవారం నడుస్తుందన్నారు. ఓకా–మధురై రైలు కడప, ఎర్రగుంట్లలో ఆగుతుందని, అహ్మదాబాద్-తిరుచునాపల్లి రైలు కడపలో మాత్రమే ఆగుతుందని, ప్రయాణీకులు గమనించాలన్నారు.

వసతికి మంగళం

కడప రూరల్: ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో పేద విద్యార్థుల వసతికి గ్రహణం పట్టింది. గడిచిన కొద్ది నెలల కాలంలోనే సమస్యలు ఎదురవుతున్నాయి. విద్యార్థులకు మెరుగైన వసతిని కల్పించాల్సిన పాలకులు నిస్తేజంగా మారారు.

కడప నగరంలో 17 హాస్టళ్లు...

జిల్లా కేంద్రమైన కడప నగరంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 2 బాలురు, 2 బాలికల ప్రీ మెట్రిక్, 3 బాలికలు, 2 బాలుర పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు ఉన్నాయి. అలాగే జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఒకటి చొప్పున బాలురు, బాలికలు ప్రీ మెట్రిక్, ఒకటి చొప్పున బాలురు, బాలికల పోస్ట్ మెట్రిక్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ పర్యవేక్షణలో ఒకటి చొప్పున బాలురు, బాలికల ప్రీ మెట్రిక్, ఒకటి చొప్పున బాలురు, బాలికల పోస్ట్ మెట్రిక్ మొత్తం 17 హాస్టళ్లు నడుస్తున్నాయి.

- బీసీ ప్రీ మెట్రిక్ హాస్టల్ విద్యార్థులకు ఇంత వరకు దుప్పట్లు, ప్లేట్స్, గ్లాసులు అందలేదు. ప్రధానంగా బాలికల పోస్ట్ మెట్రిక్ (కాలేజీ) హాస్టల్ స్థానిక కో ఆపరేటివ్ కాలనీలోని ఒక పాడుబడిన భవనంలో నడుస్తోంది. ఇందులో 100 మంది అమ్మాయిలు ఉంటున్నారు. ఈ హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.



కడప నగరంలో పాడుపడిన భవనంలో కొనసాగుతున్న బీసీ బాలికల కాలేజీ హాస్టల్

- ఎస్సీ, బీసీ హాస్టల్ హెచ్‌డబ్ల్యూఓలకు నెలల తరబడి డైట్ బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రకాష్‌నగర్‌లోని ఎస్సీ హాస్టల్ విద్యార్థులు తమ హాస్టల్‌లో టీవీని ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వం వసతికి మంగళం పాడకుండా విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రేమ, కరుణకు ప్రతిరూపం ఆరోగ్యమాత

కడప కల్చరల్ : ఆరోగ్యమాత ప్రేమ, సేవ, జాలి, కరుణలకు ప్రతిరూపమని మెర్సీ డేరియన్ గురువులు, కడప కరుణాలయం డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ జనార్దన్, ఫాదర్ సుధాకర్‌లు అన్నారు. కడప నగరం రైల్వేస్టేషన్ వద్దగల ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో నవదిన ఉత్సవాలలో భాగంగా ఏడవరోజు బుధవారం వారు దివ్య బలిపూజ సమర్పించి మరియమాత సందేశాన్ని వినిపించారు. మరియతల్లికి బాల్యం నుంచే ప్రేమ, సేవా గుణం, కరుణ గల హృదయం ఉండేవని, అందుకే ఆమెను దయగల మాత, సహాయ, రక్షణ మాత అని కొనియాడుతున్నట్లు తెలిపారు. ప్రార్థనలనంతరం శాంతి సేవా సొసైటీ జ్ఞాపికలు అందించి గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్రం డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ ఎండీ ప్రసాద్‌రావు, బిషప్ సెక్రటరీ , ఫాదర్లు లూర్దురాజు, విజయరావు, బాలశౌరి, మరియన్న, చైతన్య, సహాయ డైరెక్టర్ పిల్లి మహేష్, మదర్ సెల్వి రాయప్పన్, క్యాథరిన్, జేఎంజే, క్రీస్తు జ్యోతి సిస్టర్లు, యూత్ కమిటీ విన్సెంట్ ది పాల్, మరియదళం, మౌలిక సంఘం సభ్యులు పాల్గొన్నారు.



దైవ సందేశం అందజేస్తున్న గురువులు

ఖైదీలకు సౌకర్యాలను కల్పించాలి

కడప అర్బన్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్ జి. శ్రీదేవి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ బుధవారం కడప కేంద్ర కారాగారంలో, ప్రత్యేక మహిళా కారాగారంలో ఖైదీల సౌకర్యాలను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయసహాయం సద్వినియోగం చేసుకోవాలన్నారు. కారాగారం పరిసరాలను, వంటగదులను పరిశీలించారు.

అత్యుత్తమ పరిశోధన ఫలితాలు రావాలి



అధ్యాపకులతో సమావేశం నిర్వహిస్తున్న వీసీ తదితరులు

వైవీయూ: అత్యుత్తమ ప్రమాణాలతో పరిశోధనా ప్రాజెక్టులు పూర్తి చేయాలని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి అన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డితో కలిసి బుధవారం పరిశోధకులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఏ యూనివర్సిటీకి రాని విధంగా 54 పరిశోధన ప్రాజెక్టులు విశ్వవిద్యాలయానికి లభించాయని ఆ విశ్వాసాన్ని కొనసాగించేలా పరిశోధనలు పూర్తిచేసి పరిశోధన పత్రాలు ప్రఖ్యాత జర్నల్స్‌లో ప్రచురితమయ్యేలా చూడాలన్నారు. వెనువెంటనే ప్రాజెక్టు ఫెలోలను నియమించుకోవాలని సూచించారు. ప్రాజెక్టులు పొందిన సైన్స్, ఆర్ట్స్ విభాగ ఆచార్యులు, సహాయ, సహ ఆచార్యులకు పరిశోధన అనుమతి పత్రాలను అందజేశారు.

నలుగురు మున్సిపల్ కార్మికులకు గాయాలు

ప్రమాద బాధితులను పరామర్శించిన మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: కడప నగరంలో చెత్త తరలించే వాహనం (కంపాక్టర్) ప్రమాదానికి గురైంది. తెల్లవారుజామున 3 గంటలకు జమాల్‌పల్లి ఎన్‌టీపీసీ వద్ద ఈ ప్రమాదం జరిగింది. ఇందులో నలుగురు కార్మికులకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయాలపాలైన వారిని రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. కార్మికులు ప్రమాదానికి గురవడంతో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో రిమ్స్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాలు పూర్తిగా పాడయ్యాయని, ఫిట్‌నెస్‌గా లేవని, ఇన్స్యూరెన్స్ కూడా లేదన్నారు. ఈ వాహనాలకు అర్హత లేని, నైపుణ్యం లేని కార్మికులను వాడుకుంటున్నారన్నారు. హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ఆప్కాస్ డ్రైవర్లను కాదని, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు వారి ఇష్టానుసారంగా అదనపు వర్కర్లను డ్రైవర్లుగా వాడుకుంటున్నారన్నారు. అందులో కొందరికి డ్రైవింగ్ లైసెన్స్ కూడా లేదన్నారు. ఇలాంటి ప్రమాదాలు జరిగితే వారి కుటుంబాలకు దిక్కు ఎవరని ప్రశ్నించారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స కోసం రూ.10లక్షల పరిహారం అందించాలని, వారు పూర్తిగా కోలుకునే వరకూ వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. వారి కుటుంబంలో ఒకరికి పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. ప్రమాదానికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ధర్నా చేస్తున్న వారి వద్దకు అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రన్, ఎంహెచ్‌ఓ డా. చంద్రశేఖర్‌లు వెళ్లి చర్చలు జరిపారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స కోసం ప్రవేటు హాస్పిటల్ లో చేర్పిస్తామని, ఐదు లక్షలు వారి అకౌంట్లో జమ చేస్తామని, పర్యవేక్షణ కు ఒక అధికారిని నియమిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు వారిని ప్రైవేటు హాస్పిటల్స్‌కు తరలించారు.

కార్మికులకు పరామర్శ

గాయపడిన మున్సిపల్ కార్మికులను మేయర్ సురేష్ బాబు పరామర్శించారు. విద్యా సాగర్ హాస్పిటల్‌కు వెళ్లి ఆయన కార్మికులను పరామర్శించి, వైద్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కార్మికులకు మెరుగైన చికిత్స అందించాలని, చికిత్సకు అయ్యే మొత్తం ఖర్చు కార్పొరేషనే భరిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుంకర రవి, తిరుపాల్, చంద్ర రెడ్డి, శ్రీరామ్, ప్రకాష్, కిరణ్ ,గోపి విజయ్, నాగరాజ్, వెంకటేష్, శ్రీధర్, బాలాజీ, మస్తాన్ పాల్గొన్నారు.



రిమ్స్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు



విద్యాసాగర్ హాస్పిటల్‌లో కార్మికులను పరామర్శించి వైద్యులతో మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు

అంధత్వ నివారణకు తోడ్పాటునివ్వాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

కడప అర్బన్: అంధత్వ నివారణకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలని, ఇందుకోసం నేత్రదానానికి ప్రతిజ్ఞ చేయాలని, అందరికీ ఆదర్శంగా నిలబడాలని కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ తెలియజేశారు. బుధవారం 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు కడపలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. కడప నగరంలోని మహావీర్ సర్కిల్‌లో నేత్రదానం గురించి అవగాహన కల్పించారు. ఈ ప్రదర్శన జరుగుతుండగా కొందరు ప్రజలు స్వచ్ఛందంగా నేత్రదానం చేయుటకు సమ్మతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కంటి విభాగం హెచ్‌ఓడి డాక్టర్ ఎం. కిరణ్మయి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కస్తూరిబాయి, డాక్టర్ వెంకటయ్య, డాక్టర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మట్టి విగ్రహాల తయారీ పోటీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : వినాయక చవితిని పురస్కరించుకుని మట్టి విగ్రహాల వాడకాన్ని ప్రోత్సహిస్తూ విద్యార్థులకు మట్టి విగ్రహాల తయారీ పోటీని నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కడప ప్రాంతీయ కార్యాలయ ఇంజనీరు శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5వ తేది మధ్యాహ్నం 2 గంటలకు కడపలోని పవన్ కాన్సెప్ట్ స్కూలులో ఈ పోటీలు ఉంటాయన్నారు. ఉత్తమ విగ్రహాలకు బహుమతులు సైతం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కడపలో చోరీ

కడప అర్బన్: కడప నగరం ప్రకాష్ నగర్‌లో ఓ ఇంటిలో దొంగలు పడి బంగారం, నగదును అపహరించారు. ఈ మేరకు బాధితుడు రాజారత్నం చిన్న చౌక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రకాష్‌నగర్‌కు చెందిన రాజారత్నం ఇంటికి తాళాలు వేసి మధ్యాహ్నం బయటికి వెళ్లారు. తిరిగి సాయంత్రం వచ్చేలోపు ఇంటి తాళాలు పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోని ఐదు తులాల బంగారు ఆభరణాలను, రూ. లక్ష నగదును అపహరించినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

6న కలెక్టరేట్ ఎదుట ధర్నా

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈ నెల 6న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నట్లు సీపీఐ నగర సహాయ కార్యదర్శి కేసీ బాదుల్లా పేర్కొన్నారు. బుధవారం నగరంలోని బహుజన నగర్ , రామరాజు పల్లెలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు శంకర్ నాయక్, మునయ్య, హుస్సేన్ పాల్గొన్నారు.

ఎస్ఓపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: అట్లూరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థుల కడుపు కొడుతున్న ఎస్ఓ పై చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాల ని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు ఎద్దు రాహుల్ , వీరపోగు రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో డీఆర్వో గంగాధర్ గౌడ్‌కు వినతి పత్రం సమర్పించారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: వరద ప్రళయాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని, ప్రధాని మోడీ వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటించి ఆంధ్ర, తెలంగాణను ఆదుకోవాలని సీపీఎం కడప జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ. రామ్మోహన్ తెలిపారు. బుధవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో వరద ప్రళయం లక్షలాది మందిని నిరాశ్రయులను చేసిందని, మూడు రోజులుగా వరద బాధితులు నీరు, ఆహారం , మందుల కోసం అల్లాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వరద బాధితులను తక్షణం ఆదుకోవాలన్నారు.

ఘన సన్మానం

కడప ఎడ్యుకేషన్: జేకే జనం కోసం సేవా సాంస్కృతిక, విద్య క్రీడాభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జేకే ఖాదర్ బాష ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం అలంఖాన్‌పల్లి జడ్పీ హైస్కూల్‌లో హిందీ ఉపాధ్యాయుడు ఫర్హతుల్లాను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అలాగే పాఠశాలలో 8, 9, 10 తరగతులలో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మునిరత్నమ్మ, రాయల్ కరీం సేవా సమితి వ్యవస్థాపకులు అబ్దుల్ షేక్ కరిముల్లా, నగర ప్రముఖులు చాంద్‌బాష, పీఈటీ నిత్యానంద పాల్గొన్నారు.

10 టన్నుల అరటికాయల తరలింపు

కడప అగ్రికల్చర్: విజయవాడ వరద బాధితుల కోసం మార్కెటింగ్‌శాఖ జేడీ రామాంజనేయులు ఆదేశాల మేరకు కడప మార్కెట్‌శాఖ ఆధ్వర్యంలో 10 టన్నుల అరటికాయలను విజయవాడకు పంపినట్లు కడప మార్కెట్‌యార్డు సెక్రటరీ సుజాత తెలిపారు. ఈ అరటి పండ్లను అక్కడ వరద బాధితులకు పంపిణీ చేస్తామని ఆమె తెలిపారు.

కడప విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా జి. శ్రీనివాసరావు

కడప అర్బన్: జిల్లా రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీగా శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న మాసుం బాషా బదిలీ కావడంతో ఇన్‌ఛార్జ్‌గా కరీముల్లా షరీఫ్ వ్యవహరించారు. ప్రస్తుతం ఖాళీగా వున్న విజిలెన్స్ అదనపు ఎస్పీ స్థానాన్ని శ్రీనివాసరావును నియమించి భర్తీ చేశారు. త్వరలోనే ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

వికసిత్ భారత్‌కు తోడ్పాటు అందించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రధాని మోదీ పిలుపు మేరకు వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు సాగేందుకు ప్రజలు బీజేపీ సభ్యత్వాన్ని తీసుకుని తోడ్పాటు అందించాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు వంగల శశిభూషణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఎన్జీఓ కాలనీలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. అంతకుముందు జాతీయ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో బీజేపీ సభ్యత్వ నమోదు, రెన్యూవల్ కార్యక్రమాలను జిల్లా అధ్యక్షులు ప్రారంభించి మాట్లాడారు.

ఇంక్రిమెంట్ల కోత ఉత్తర్వులను రద్దు చేయాలి

కడప ఎడ్యుకేషన్: సార్వత్రిక ఎన్నికల విధులకు హాజరు కాలేదనే కారణంగా జిల్లాలోని నలుగురు ప్రధానోపాధ్యాయులకు విధించిన ఇంక్రిమెంట్ల కోత ఉత్తర్వులను రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై బుధవారం పాఠశాల విద్య ఆర్‌జేడీ శామ్యూల్‌ను కడపలో కలిసి వినతి పత్రం సమర్పించారు.

శ్రమ తత్వమే దేశం గర్వించదగిన వారసత్వం



సత్కారం అందుకున్న గురువులతో అతిథులు

కడప కల్చరల్ : మన దేశానికి గర్వించదగిన వారసత్వ సంపద శ్రమతత్వమేనని వైవీయూ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందస్తు వేడుకల్లో భాగంగా బుధవారం స్థానిక మానస ఇన్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళి అర్పించారు. ఇంటాక్ , లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్యతో కలిసి సంస్థలలో సభ్యులుగా ఉన్న ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య కె.కృష్ణారెడ్డి మాట్లాడుతూ మనం దేశ వారసత్వ సంపదగా ఘనంగా చెప్పుకునే శ్రమతత్వం క్రమంగా తగ్గిపోతుండేమోనని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా నీటిపారుదలశాఖ ఎస్ఈ కమతం శ్రీనివాసులు మాట్లాడుతూ నాటి గురువుకు దేశ భక్తి, సమాజం పట్ల బాధ్యత ఉండేవని, విద్యార్థి భవిష్యత్తు పట్ల వారికి ఆందోళన ఉండేదన్నారు. తన గురువులు బోధించిన బాధ్యత తనకు బాగా గుర్తుందని, అధికారిగా తనకు లభించిన అవకాశంతో ఉలిమెల తదితర ప్రాజెక్టులను గొప్పగా తీర్చిదిద్దగలిగామన్న తృప్తి ఉందన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అనంతబొట్ల వెంకటసుబ్బయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇంటాక్ కన్వీనర్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశ పునర్నిర్మాణంలో వహించిన పాత్రను వివరించారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చాక ప్రాథమిక విద్య ప్రాధాన్యత తగ్గిందని, ఉన్నత విద్యకు పునాదులు లేకపోవడం ఆందోళనకరమన్నారు. వైవీయూ ఆచార్యులు ఎస్.ఈశ్వర్‌రెడ్డి విద్యార్థి అభివృద్ధికి గురువు తొలిమెట్టు అని అభివర్ణించారు. అనంతరం ఇంటాక్, లయన్స్ క్లబ్‌లో సభ్యులైన 42 మంది ఉపాధ్యాయులను అతిథులతో కలిసి సత్కరించారు.

కేవీకేలో 6న రైతులకు శిక్షణ

కడప అగ్రికల్చర్: కడప నగర శివార్లలోని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 6వ తేదీన నర్సరీలో నారు పెంపకం అనే అంశంపై రైతులతో పాటు ఆసక్తి ఉన్న వారికి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేవీకే జిల్లా కో ఆర్డినేటర్ వీరయ్య తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 79817 20286 నంబర్‌కు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటలలోపు కాల్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

ఎల్ఐసీ ప్రచార వాహనాలు ప్రారంభం

కడప కల్చరల్ : ఎల్ఐసీ పాలసీల ప్రచార వాహనాలను సంస్థ మార్కెటింగ్ మేనేజర్ శ్యాం సుందర్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. బీమా వారోత్సవాల సందర్భంగా 10 ప్రచార వాహనాలను బుధవారం ఆయన సంస్థ కార్యాలయ ప్రాంగణంలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సంస్థ గత ఆర్థిక సంవత్సరంలో ఏడు నూతన పాలసీలను ప్రారంభించిందని, ఇవన్నీ మంచి ఆదరణ పొందాయన్నారు. డివిజన్ వ్యాప్తంగా ఎల్ఐసి పథకాలపై, సామాజిక రంగాల్లో పెట్టుబడులపై, ఏజెన్సీ అవకాశాలపై ప్రచారం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులకు పలు క్రీడ, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. అపర్ణ, సరళ, లక్ష్మి, ప్రసన్న లక్ష్మి, స్వరూప పాల్, శ్రీకృష్ణలు విజేతలుగా నిలిచారు.

వరద ప్రాంతాలలో సహాయక చర్యలు



సహాయక చర్యలను చేపడుతున్న కడప చిన్నచౌక్ ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి

కడప అర్బన్: విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాలలో వైఎస్ఆర్ జిల్లా పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. బాధితులను ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బందితో కలిసి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ నెల 3న 250 మంది జిల్లా పోలీసు యంత్రాంగం అక్కడికి వెళ్లి సహాయక చర్యలు చేపడుతున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఏపీఎస్‌బీసీఎల్ డిపో ఎదుట నిరసన తెలుపుతున్న సూపర్ వైజర్లు, సేల్స్‌మెన్లు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు శివానందరెడ్డి, సుధాకర్ బాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన మద్యం విధానాన్ని నిరసిస్తూ బుధవారం కడప డిపో పరిధిలోని మద్యం దుకాణాల్లో పని చేస్తున్న సూపర్ వైజర్లు, సేల్స్‌మెన్లు ఏపీఎస్‌బీసీఎల్ డిపో వద్ద నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ ఒక్కో షాపులో ఒక సూపర్ వైజర్, ముగ్గురు సేల్స్‌మెన్లు, నైట్ వాచ్‌మెన్ పని చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ దుకాణాల స్థానంలో ప్రైవేట్ దుకాణాలను తీసుకువచ్చేందుకు నేటి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. అది కార్యరూపం దాల్చితే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 6 లోపల సానుకూల నిర్ణయాన్ని ప్రకటించకపోతే 7న బేవరేజస్ ఆధ్వర్యంలో మద్యం దుకాణాలు బంద్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రాజ్‌కుమార్, ప్రసన్న కుమార్, స్వామి నాథ్, రామాంజనేయులు, శివకృష్ణ, రామకృష్ణ, నిత్యపూజయ్య తదితరులు పాల్గొన్నారు.